మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 70 వెల - రూ 5 : 00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada






# నేడే 'తుది'పోరు

## ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు పోలింగ్

## బరిలో దాదాపు 904 మంది అభ్యర్థులు



**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** లోక్‌సభ తుదిదశ ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. దాదాపు 904 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. వారణాసి నుంచి ఆయన మూడోసారి పోటీ చేస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు ఈ ఏడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ మూడో సారి వారణాసి నుంచి పోటీ చేస్తున్నారు.పంజాబ్ లోని మొత్తం 13 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్ లో నాలుగు స్థానాలకు, ఉత్తర్ ప్రదేశ్ లోని 13 నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ లోని తొమ్మిది స్థానాలకు, బీహార్ లోని ఎనిమిది స్థానాలకు, ఒడిశాలోని ఆరు స్థానాలకు, ఝార్ఖండ్ లోని మూడు సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా 2లో..



## నేటితో ముగియనున్న కేజ్రీవాల్ బెయిల్

### మళ్లీ జైలుకు వెళుతున్నా.. కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, (ప్రజామంటలు):** ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఓ వీడియో రిలీజ్‌చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్ మీద మిగతా 2లో..

## ప్రజ్వల్ రేవణ్ణకు ఆరు రోజుల సిట్ కస్టడీ

### అరెస్ట్ చేసి తీసుకుని వెళ్లిన మహిళా పోలీసులు



2లో..

### మానవాళిపై పగబట్టిన వైరస్‌లు

# వేగంగా విస్తరిస్తోన్న బర్డ్ ఫ్లూ..

పలు రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్ - పౌల్ట్రీలు, ఇతర పక్షుల అసాధారణ మరణాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా మానవులకూ సోకే ఆస్కారం ఉందని హెచ్చరిక



**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా లేదా బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1)పై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు నాలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ లక్షణాలను గుర్తించింది. ఏపీలోని నెల్లూరు, మహారాష్ట్రలోని నాగపూర్, కేరళలోని అలప్పుజ, కొట్టాయం, ఝార?ండ్‌లోని రాంచీలలో దాని వ్యాప్తిని గుర్తించినట్లు కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో పౌల్ట్రీలు, ఇతర పక్షులకు సంబంధించి అసాధారణ మరణాలు సంభవించడంపై అప్రమత్తంగా ఉండాలని, ఆ విషయాన్ని వెంటనే పశు సంవర్ధక శాఖకు తెలియజేయాలని అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. అత్యంత వేగంగా వ్యాప్తి చెందే ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా మానవులకూ సోకే ఆస్కారం ఉందని హెచ్చరించింది. ఈ వ్యాధి సంక్రమణను నిరోధించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొంటూ మే 25న ఎన్సీడీసీ, కేంద్ర పశుసంవర్ధక శాఖలు కలిసి సంయుక్తంగా జారీ చేసిన ప్రకటనలో వెల్లడించాయి. యాంటీవైరల్ ఔషధాలు, పీపీఈ కిట్లు, మాస్కులు అందుబాటులో ఉండాలని పేర్కొంది. ఇన్‌ఫెక్షన్ సోకిన పక్షులను వధించే వారితోపాటు పర్యవేక్షకుల నుంచి క్రమంగా నమూనాలు తీసుకొని హెచ్5ఎన్1 పరీక్షలు నిర్వహించాలని తెలిపింది.

# ఎగ్జిట్ పోల్స్ సాయంత్రం 6.30 తర్వాతే..

## కీలక ఆదేశాలు జారీచేసిన ఎన్నికల సంఘం

## నిర్ణీత సమయం కంటే ముందుకు ఇవ్వరాదని సూచన

## లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్ చర్చల్లో పాల్గొనొద్దని కాంగ్రెస్ నిర్ణయం




**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** దేశవ్యాప్తంగా శనివారం వెలువడబోయే ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ తరుణంలో శుక్రవారం సాయంత్రం కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. నేటితో లోక్‌సభ ఎన్నికల చివరిదశ పోలింగ్ ముగియనుంది. దీంతో శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడాల్సి ఉంది. అయితే.. మిగతా 2లో..

# దేశ ఖజానాలోకి బంగారం

## ఇంగ్లండ్ నుంచి బంగారం తరలింపు

## ప్రత్యేక విమానంలో వంద టన్నుల బంగారం రాక

## భారీ బందోబస్తు మధ్య తరలించిన ఆర్‌బిఐ



**ముంబయి, మే 31 (ప్రజా మంటలు):** ఇంగ్లాండ్ నుంచి భారీఎత్తున బంగారం నిల్వలను ఆర్‌బీఐ భారత్‌కు తరలించింది. దాదాపు 100 టన్నులు అంటే లక్ష కిలోల పసిడిని దేశీయ ఖజానాలో చేర్చింది. 1991 తర్వాత ఈ స్థాయిలో బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. అప్పట్లో ఆర్థిక సంక్షోభం కారణంగా భారత్ పెద్దఎత్తున పసిడి నిల్వలను తనఖా పెట్టాల్సివచ్చింది. రవాణా, నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్ ఇంతమొత్తం బంగారాన్ని తీసుకొచ్చింది. దేశీయంగా ముంబయి మింట్ రోడ్డు సహా నాగ్‌పుర్‌లోని పాత కార్యాలయాల్లో ఆర్‌బీఐ పుత్తడిని నిల్వ చేస్తుంటుంది. కొన్నేళ్లుగా కేంద్ర రిజర్వ్ బ్యాంకు

# ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ జరపండి

## సీఎం రేవంత్ కూడా బాధితుడే అయినప్పుడు ఆలస్యమెందుకు?

## దోషులకు శిక్షపడే వరకూ భాజపా న్యాయపోరాటం

## ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో బిజెపి నేతల వెల్లడి




**హైదరాబాద్, (ప్రజా మంటలు):** ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరా పార్క్ వద్ద బీజేపీ నేతలు ధర్నా చేపట్టారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చుతోందని ఆరోపించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, వెంటనే సీబీఐకు అప్పగించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అసలైన నిందితులను పట్టుకునే ప్రయత్నం చేయడం లేదని, దీనంతటికీ కీలక సూత్రధారి మాజీ సీఎం కేసీఆరే అని విచారణలో తేలిందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో అనేక సంచలనాత్మక విషయాలు బయటపడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. అయినా కేసు వ్యవహారం పట్టనట్లు రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరిస్తోందన్నారు. తప్పు చేస్తే జైలుకు పంపిస్తామని చెప్పిన సీఎం రేవంత్... ఇన్ని సంచలనాత్మక విషయాలు బయటకు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం స్కామ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాల లీక్‌పై చర్యలు ఏవన్నారు. పోలీసు అధికారులు, కేసీఆర్ ప్రమేయంతో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని నిందితుడు వాంగ్మూలంలో చెప్పారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో మాఫియా నడిపించారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాల ఫోన్లు, చివరికి జడ్జిల ఫోన్లూ ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ బాధితుడిగా ఉన్న రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలన్నారు. అధిష్ఠానం ఒత్తిడికి లొంగిపోయారా? అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అక్రమ సంపాదనను తరలించి పోలీస్ వ్యవస్థను కేసీఆర్ దుర్వినియోగం చేశారన్నారు. కేసీఆర్, హరీశ్ రావు డైరెక్షన్‌లోనే ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు పోలీస్ అధికారులు చెప్పారన్నారు. ఇంత స్పష్టంగా తెలుస్తున్నా ముఖ్యమంత్రి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం మిగతా 2లో..

# నాగ్‌పూర్‌లో 56 డిగ్రీల ఉష్ణోగ్రత

## వడదెబ్బకు దేశవ్యాప్తంగా 54మంది మృతి


## రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలకు ప్రజల బెంబేలు

## ఢిల్లీలో అత్యధికంగా 52.9 డిగ్రీలు



2లో..

## ప్రజా నాడి




# ఏసీబీ హల్‌చల్

ఓ దస్త్రం ఆమోదం కోసం లంచం తీసుకుంటుండగా పట్టివేత



## నీటి పారుదల పారుదల శాఖలో నలుగురు..

## భూ వివాదం కేసులో సీఐ, ఎస్సై, మరొకరు..

- శుక్రవారం ఒక్క రోజే 12 మంది
- కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి దాకా
- అంతటా వేళ్లూనుకుపోయిన అవినీతి
- సీరియస్ గా తీసుకున్న కాంగ్రెస్ సర్కారు
- పదేండ్ల తరువాత జూలు విదిల్చిన ఏసీబీ
- ఇలా ఫిర్యాదు అందగానే, అలా రంగంలోకి
- భయపడుతున్న ఉద్యోగులు, అధికారులు
- పోలీసు, రెవెన్యూ శాఖలోనే లంచాలు ఎక్కువ
- గతంలో కేసులు పెట్టినా శిక్షలు లేవు?!

**హైదరాబాద్/మేడ్చల్ ప్రతినిధి, మే 31 (ప్రజా మంటలు):** నీటిపారుదల శాఖలో నలుగురు అధికారులు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డారు. ఓ దస్త్రం ఆమోదానికి సంబంధించి రంగారెడ్డి జిల్లా ఎస్ఈ కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా ఈఈ భన్సీలాల్, ఏఈలు కార్తీక్, నిఖేశ్‌లను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే సమయంలో లంచం డిమాండ్‌కు సంబంధించి కీలక అధికారి ఒకరు త్రుటిలో తప్పించు కోవడంతో అర్ధరాత్రి వరకు హైడ్రామా కొనసాగింది. ఆయన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన అధికారులు పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగించారు. సుమారు 4 గంటలు శ్రమించి నాలుగో వ్యక్తిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... నీటిపారుదల శాఖ రంగారెడ్డి జిల్లా ఎస్ఈ కార్యాలయం అధికారుల్ని ఓ దస్త్రం ఆమోదం కోసం ఓ వ్యక్తి ఆశ్రయించారు. ఇక్కడే ఈఈగా పనిచేస్తున్న భన్సీలాల్, ఏఈలు కార్తీక్, నిఖేశ్ ముగ్గురూ రూ. 2.5 లక్షలు లంచం ఇస్తే ఆమోదిస్తామని డిమాండ్ చేసినట్లు తెలిసింది. అంగీకరించిన వ్యక్తి తొలుత మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# ఏసీబీ హల్‌చల్

రూ.1.5 లక్షలు ముట్టజెప్పారు. ఇంకో రూ.లక్ష ఇవ్వాల్సి ఉంది. దీన్ని గురువారం సాయంత్రం ఈఈ కార్యాలయంలోనే తీసుకుంటామని అధికారులు చెప్పారు. ఈలోపు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో వారు నిఘా పెట్టారు. నీటిపారుదల శాఖ అధికారులు రాత్రి 8 గంటల సమయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇదే సమయంలో లంచం తీసుకోవడంలో కీలకపాత్ర పోషించిన అధికారి అప్పుడే అక్కడి నుంచి వెళ్లిపోయారు. సుమారు 4 గంటల పాటు ఆయన ఆచూకీ కోసం శ్రమించిన ఏసీబీ అధికారులు ఎట్టకేలకు పట్టుకున్నారు. నాంపల్లిలోని రెడ్‌హిల్స్ ఉన్న నీటిపారుదల శాఖ ఆఫీసులో గురువారం రాత్రి ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా ఈఈ భన్సీలాల్, ఏఈలు కార్తీక్, నికేశ్‌లు లంచం తీసుకుంటుంగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**సీఐ, ఎస్సైలను పట్టుకున్న ఏసీబీ**

హైదరాబాద్ నగరంలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఓ భూ వివాదం కేసులో రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా.. ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎస్సై షఫీ, మధ్యవర్తి ఉపేందర్‌లను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఓ భూ వివాదానికి సంబంధించి పరిష్కారం కోసం మధ్యవర్తి ద్వారా లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లోనూ సోదాలు చేశారు. లంచం తీసుకుంటుండగా పోలీసులతో పాటు మధ్యవర్తిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. గతంలో వీరిపై ఉన్న ఆరోపణలపైనా దృష్టి సారించారు. అటు, గుర్రంగూడ సమీపంలోని ఇన్‌స్పెక్టర్ వీరస్వామి నివాసంలోనూ సోదాలు జరుగుతున్నాయి.

# నేటితో ముగియనున్న కేజ్రీవాల్ బెయిల్

**మళ్లీ జైలుకు వెళుతున్నా వీడియో విడుదల చేసిన కేజ్రీవాల్**



బయటకు వచ్చిన ఆయన.. జూన్ రెండో తేదీన సరెండర్ కానున్నట్లు చెప్పారు. మళ్లీ తీహార్ జైలుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌తో లింకున్న మనీ ల్యాండరింగ్ కేసులో కేజ్రీని ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ తరపున ప్రచారం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ పెట్టుకున్నారు. ఆయనకు 21 రోజుల తాత్కాలిక బెయిల్‌ను సుప్రీం జారీ చేసింది. ఆ బెయిల్ గడువు జూన్ ఒకటో తేదీతో ముగియనున్నది. బెయిల్‌ను పొడిగించాలని పెట్టుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ స్వీకరించలేదు. దీంతో దారులు మూసుకుపోయాయి. దేశాన్ని నియంతృత్వం నుంచి రక్షించేందుకు మళ్లీ జైలుకు వెళ్లనున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. మళ్లీ జైలుకు వెళ్తే తనను ఎన్ని రోజులు బంధిస్తారో తెలియదన్నారు. జైలులో ఉన్నప్పుడు తనను ఎన్నో విధాలుగా వేధించినట్లు ఆరోపించారు. తనకు మెడిసిన్ ఇవ్వడం ఆపేశారన్నారు. జైలుకు వెళ్లేముందు తన బరువు 70 కేజీలు అని, ఇప్పుడు 64 కేజీలకు చేరుకున్నట్లు వెల్లడించాడు. జైలు నుంచి రిలీజైన తర్వాత కూడా ఇంకా బరువు పెరగలేదన్నాడు. తమ సర్కారు అమలు చేస్తున్న అన్ని స్కీమ్‌లు యధాతథంగా ఉంటాయని, మళ్లీ వచ్చిన తర్వాత ప్రతి మహిళకు వెయ్యి ఇస్తానన్నారు.

# ఎగ్జిట్ పోల్స్ సాయంత్రం 6.30 తర్వాతే..

నిర్ణీత సమయం కంటే ముందు ఫలితాలను ఇవ్వకూడదని ఈసీ తాజాగా ఆదేశాలు విడుదల చేసింది. జూన్ 1వ తేదీ శనివారం సాయంత్రం 6:30 తరువాతే ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయాలని తెలిపింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 126ఏ(1) ప్రకారం నిబంధనలు పాటించాల్సిందేనని తాజా ఆదేశాల్లో ఈసీ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిషా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు,అలాగే దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లోని 25 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. అయితే వీటన్నింటికి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ఈసీ బ్యాన్ చేసింది. పూర్తి స్థాయిలో అంతటా పోలింగ్ ముగిసిన తర్వాతే వెల్లడించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్లకు మార్చి 28వ తేదీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈసీ స్పష్టంగా పేర్కొంది.

**లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్ చర్చల్లో పాల్గొనొద్దు**

ఎగ్జిట్ పోల్స్‌పై కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. టెలివిజన్ ఛానెళ్లలో లోక్‌సభ ఎగ్జిట్ పోల్ చర్చల్లో పాల్గొనకూడదని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. టీఆర్పీల కోసం ఊగాహానాల్లో మునిగిపోకూడదని తెలిపింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి, మీడియా విభాగం చైర్‌పర్సన్ పవన్ ఖేరా మాట్లాడుతూ.. ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారని, వారి తీర్పు ఖాయమైందని చెప్పారు. "జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. దానికి ముందు, టీఆర్పీ కోసం ఊహాగానాలు, స్లగ్‌ఫెస్ట్‌లో మునిగిపోవడానికి మాకు ఎటువంటి కారణం కనిపించడం లేదు. భారత జాతీయ కాంగ్రెస్ ఎగ్జిట్ పోల్స్‌పై చర్చలలో పాల్గొనదు. ఏదైనా చర్చ ఉద్దేశ్యం ప్రజలకు తెలియజేయడమే. మేము జూన్ 4 నుండి చర్చలలో సంతోషంగా పాల్గొంటాము" అని పవన్ ఖేరా ఓ ప్రకటనలో తెలియజేశారు. పార్టీలో సంప్రదింపుల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ జరపండి

అవుతుందని ఎంపీ లక్ష్మణ్ జోస్యం చెప్పారు. ఎమ్మెల్యేల కొనుగోలు ఫేక్ సినిమా డ్రామా అని తానే ముందే చెప్పానన్నారు. 'లిక్కర్ కేసులో కవితను గట్టెక్కించేందుకు ఎమ్మెల్యేల కేసు బయటకు తీసుకొచ్చారు. దారుణమైన స్థితికి కేసీఆర్ దిగజారిపోయారు. రేవంత్‌పై ఢిల్లీ పెద్దల ఒత్తిడి ఉంది. లేదంటే వెంటనే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు, పాత్ర దారులపై చర్యలు తీసుకోవాలి. కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నేతలంతా డిమాండ్ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కీలక వ్యక్తులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకు అప్పగించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో మాఫియా నడిపించారని మండిపడ్డారు. వెంటనే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు, పాత్ర దారులపై చర్యలు తీసుకోవాలి. కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలి' అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## నేడు చివరిదశ లోక్‌సభ ఎన్నికలు

ఈసారి పోటీలో ఉన్న ప్రముఖులలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, లాలూ ప్రసాద్ కూతురు మిసా భారతి, నటి కంగనా రనౌత్ ఉన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనున్నది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం టెలివిజన్ ఛానల్స్, వార్తా సంస్థలు జూన్ 1న సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్ డేటాను ప్రదర్శించుకోవచ్చు. దీంతో ఇప్పటికే డేటాతో సిద్ధంగా ఉన్న పలు సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్‌ను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

## దేశ ఖాజనాలోకి బంగారం



పెద్దఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తూ వస్తోంది. దీన్ని ఎక్కడ నిల్వ చేయాలనేది ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో విదేశాల్లోని మన నిల్వలు గణనీయంగా పెరిగాయి. దీంతో కొంత మొత్తాన్ని భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. చాలా దేశాల కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. అదే బాటలో భారత్ సైతం అక్కడి డిపాజిటరీల్లో పెద్దఎత్తున పసిడిని నిల్వ చేస్తూ వచ్చింది. 2024 మార్చి ముగిసేనాటికి ఆర్‌బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. దీంట్లో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వ చేసి ఉంచింది. ఇటీవల కొన్నేళ్లుగా వరుసగా కొనుగోలు చేస్తూ వచ్చిన ఆర్‌బిఐ గత ఏడాది 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వల్లో చేర్చింది. ఈ ఏడాది కొనుగోళ్ల జోరు మరింత పెరిగింది. జనవరి– ఏప్రిల్ వ్యవధిలోనే 2023 మొత్తం కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారం కొనుగోలు చేయడం గమనార్హం. రవాణా, భద్రత విషయాలను పరిగణనలోకి తీసుకుంటే 100 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించడం మామూలు విషయం కాదు. దీనివెనక కొన్ని నెలల కసరత్తు అవసరం. ఆర్‌బీఐ, ఆర్థికశాఖ సహా వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక యంత్రాంగం మధ్య సమగ్ర సమన్వయం ఉండాలి. ఈ బంగారాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు తొలుత ఆర్థికశాఖ నుంచి ఆర్‌బీఐ కస్టమ్స్ సుంకం మినహాయింపు తీసుకుంది. సాధారణంగా అన్ని దిగుమతులపై వర్తించే ఐజీఎస్టీ మాత్రం తప్పలేదు. తద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోవాల్సి ఉండటమే దీనికి కారణం. ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని భారత్‌కు తరలించేందుకు ప్రత్యేక విమానాన్ని ఉపయోగించారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా తరలింపుతో ఆర్‌బీఐ నిర్వహణ వ్యయాలు స్వల్ప స్థాయిలో తగ్గుతాయి. ఇప్పటి వరకు బంగారం నిల్వ చేసినందుకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెల్లిస్తూ వచ్చిన రుసుము ఇకపై చెల్లించనక్కరలేదు.

# నాగ్‌పూర్‌లో 56 డిగ్రీల ఉష్ణోగ్రత

**వడదెబ్బకు దేశవ్యాప్తంగా 54మంది మృతి**

**రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలకు ప్రజల బెంబేలు**

**ఢిల్లీలో అత్యధికంగా 52.9 డిగ్రీలు**



నాగ్‌పుర్,మే31 (ప్రజా మంటలు):

దేశవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మొన్నటికి మొన్న దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఆ ఉష్ణోగ్రతను దాటి ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పుర్ లో ఏకంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పుర్‌లో భారత వాతావరణ విభాగం నాలుగు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో రెండింట గురువారం అసాధారణ ఉష్ణోగ్రతలు చూపించాయి. సోనేగావ్‌లోని ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌లో 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. ఉత్తర అంబాజరీ రోడ్డులోని ఐఎండీ కేంద్రంలో రికార్డు స్థాయిలో 56 డిగ్రీలు నమోదైంది. మిగతా రెండు స్టేషన్లలో 44 డిగ్రీల ఎండలు ఉన్నట్లు రికార్డయ్యింది. ఇటీవల ఢిల్లీలోని ముంగేష్‌పుర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఢిల్లీ చరిత్రలో ఇదే అత్యధికం కావడంతో వాతావరణ శాఖ స్పందించింది. ఆ వాతావరణ స్టేషన్‌లోని సెన్సార్ సరిగా పనిచేస్తుందో, లేదో తనిఖీ చేస్తున్నట్లు తెలిపింది. ఈ పరిణామాల వేళ ఇప్పుడు నాగ్‌పుర్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడం మరోసారి చర్చకు దారితీసింది. ఇక్కడా సెన్సార్ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది. మరోవైపు తీవ్రమైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పటికే వడదెబ్బ కారణంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా బిహార్‌లో 32 మంది మృతి చెందగా.. ఒడిశాలో 10, ఝార్ఖండ్‌లో 5, రాజస్థాన్‌లో ఐదుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు, ఢిల్లీలో ఒకరు మరణించారు. రానున్న రెండు రోజుల్లో యూపీ, ఢిల్లీ, చండీగఢ్, హరియాణాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుపాను వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వడగాలులు తీవ్రంగా ఉన్నందున దేశంలో జాతీయ ఎమ్జర్జ÷న్సీని విధించే అవకాశాలను పరిశీలించాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచించింది.మరోవైపు, దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం కాస్త ఊరటనిచ్చే విషయం. గురువారం కేరళ తీరాన్ని తాకిన ఈ రుతుపవనాలు.. ప్రస్తుతం దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇవి మిగతా ప్రాంతాలకు విస్తరించే అవకాశముంది. దీంతో శనివారం నుంచి వడగాలుల తీవ్రత కాస్త తగ్గొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# ప్రజ్వల్ రేవణ్ణకు ఆరు రోజుల సిట్ కస్టడీ

## అరెస్ట్ చేసి తీసుకుని వెళ్లిన మహిళా పోలీసులు

బెంగళూరు, మే 31 (ప్రజా మంటలు):



పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు బెంగళూరు కోర్టు కస్టడీ విధించింది. జూన్ 6 వరకు సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు ఇచ్చింది. అశ్లీల వీడియోల కేసులో ప్రధాన నిందితుడైన ప్రజ్వల్ తన నియోజకవర్గం హాసనలో ఎన్నిక ముగియగానే విదేశాలకు వెళ్లిపోయారు. దాంతో అతడిని స్వదేశానికి రప్పించేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. స్వదేశానికి వచ్చి విచారణకు సహకరించాలని జేడీఎస్ పెద్దలు దేవెగౌడ, కుమారస్వామి హెచ్చరించిన నేపథ్యంలో.. జర్మనీ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు వచ్చిన అతడిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బెంగళూరులోని కోర్టు ముందు హాజరుపర్చారు. పోలీసులు 14 రోజుల కస్టడీ కోరగా.. ప్రస్తుతం కోర్టు అతడికి ఏడు రోజుల కస్టడీ విధించింది. ఇదిలాఉంటే.. అతడిని అరెస్టు చేసిన సిబ్బంది అంతా మహిళలే కావడం గమనార్హం. ఎంపీ పదవిని, పలుకుబడిని అడ్డంపెట్టుకొని మహిళలపై బెదిరింపులకు పాల్పడ్డాడు. అందుకే అతడిని అరెస్టు చేసే అధికారం కూడా ఆ మహిళలకే ఉందనే సందేశాన్ని ఇవ్వాలని అనుకున్నాం అని సిట్ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అశ్లీల వీడియోల కేసులో అరెస్ట్ అయిన ప్రజ్వల్ రేవణ్ణకి ఆరు రోజుల పాటు పోలీస్ కస్టడీలో ఉండనున్నారు. జూన్ 6వ తేదీ వరకూ ఆయనను కస్టడీలో ఉంచేందుకు అనుమతి లభించింది. జర్మనీ నుంచి వచ్చిన రేవణ్ణని బెంగళూరులోని కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌లోనే సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి 12.45 గంటలకు ముగ్గురు మహిళా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మహిళా పోలీసులతో ప్రజ్వల్ రేవణ్ణని అరెస్ట్ చేయించడంపై ప్రశంసలు వెల్లువెత్తాయి. కర్ణాటక మహిళా పోలీసులు రాష్ట్రంలోని మహిళలందరికీ రక్షణ కల్పిస్తామన్న సంకేతాలిచ్చారంటూ కొందరు పొగడ్తలు కురిపించారు. ప్రజ్వల్‌ని అరెస్ట్ చేసిన వెంటనే మెడికల్ చెకప్‌కి తీసుకెళ్లారు. ఆ తరవాత ఆయనను కోర్టులో ప్రవేశపెట్టారు. 14 రోజుల పాటు కస్టడీలో ఉంచేందుకు అనుమతినివ్వాలని పోలీసులు కోర్టుని కోరారు. ఒక్కరోజు కస్టడీలో ఉంచితే చాలంటూ ప్రజ్వల్ తరపున న్యాయవాది వాదించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు చివరకు ఆరు రోజుల పాటు కస్టడీకి అనుమతినిచ్చింది.

# గుదిబండ పథకాలను సమీక్షించాలి

## ఆర్థికంగా దెబ్బతీస్తున్న వాటిని సంస్కరించాలి

హైదరాబాద్,మే31 (ప్రజా మంటలు):

ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిన క్రమంలో ఇప్పటికే జీతాలకు, పెన్షన్లకు కష్టంగా మారింది. పథకాల అమలు కూడా భారంగా మారబోతున్నది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెటీలు కూడా ఆర్థికంగా ఇరుకున పెట్టేవే. ఈ క్రమంలో దుబారా పథకాలను పక్కన పెట్టే నిర్ణయాలను రేవంత్ సర్కార్ తీసుకోవాలి. ఈ క్రమంలో పథకాలను సమీక్షించుకుని కఠిన నిర్ణయాలతో ముందుకు సాగాలి. ప్రధానంగా జిల్లాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు ఆర్థికంగా భారంగా మారింది. అలాగే అడ్డదిడ్డంగ ఆమారింది. 10 జిల్లాలు ఉన్న తెలంగాణను పాలనా వికేంద్రీకరణలో భాగంగా 33 జిల్లాలో చేశారు. దేశంలో ఇంతటి అరుదైన నిర్ణయం తెలంగాణలో మాత్రమే జరిగింది. ఆశలను కల్పించడం వేరు.. వాటిని సాకారం చేయడం వేరు. తెలంగాణ కలను సాకారం అయిన సందర్భంలో జిల్లాల విభజన అన్నది పద్దతి ప్రకారం జరగలేదు.ఇలా అనేక విషయాలను సమీక్షించుకుంటే తప్ప ముందుకు సాగడం కష్టం. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఒక్కో హామీని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తూనే, ఆర్థికంగా నిలదొక్కుకోగలగాలి. ప్రజలు భాగస్వాములైతే తెలంగాణ పురోభివృద్ధి లో కీలకం కానుంది. ఇక మరో విశేషమేమంటే సమైక్య రాష్ట్రం అవసరాలకు అనుగుణంగా రూపొందించిన అనేక పథకాలను, చట్టలాను మార్పు చేసుకుంటే తెలంగాణ అస్తిత్వానికి అనుగుణంగా సాగగలదు. పేదలు కూడా గౌరవంగా బతికేలా అందరికీ ఇళ్లు కట్టించే ఆలోచన మంచిదే. అయితే ప్రజలు స్వయం సమృద్ధితో ఎదిగిలే పథకాలు రూపొందించాలి. రెండు పడకగదుల ఇళు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిలో కొత్త ఆశలు చిగురింపజేశాయి. అయితే అది సాకారం కాలేదు. ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు అలా కాకుండా చూసుకోవాలి. ఇదే సందర్భంలో గత తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించుకునే తరుణం ఇది. అనేక పథకాలు గుదిబండగా ఉన్నాయి. ఆర్థికంగా దెబ్బ తీస్తున్న పథకాలను సమీక్షించుకోవాలి. లేకుంటా ఖజానాపై తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే దండగ మారి పథకాలను సమీక్షించుకోవాలి. కిలో రూపాయి బియ్యం పథకం తక్షణం సవరించాలి. కొత్త కార్డుఉల ఇచ్చే ముందు పాతకార్డుల్లో ఎంతమంది అర్హులో తేల్చాలి. అలాగే కిలో బియ్యం పథకాన్ని సమీక్షించి కనీసం కిలో ఐదుతో ప్రారంభించాలి. అలాగే రైతుబంధునుంచి అనర్హులను కూడా తొలగించాలి. పెన్షన్ స్కీమ్‌ను 60 ఏళ్లనుంచే మొదలు పెట్టేలా కొనసాగించాలి. అందులోనూ అనర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలి. లేకుంటే ఇవన్నీ కూడా ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పేదలకు ఉచిత విద్యను అందించే క్రమంలో ఆరోగ్యశ్రీ ని అందుబాటులోకి తేవడం మంచిదే అయినా..క్షేత్రస్థాయిలో ఆస్పత్రులను కూడా బలోపేతం చేయాలి. గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పునరుద్ధరించి పటిష్టం చేయాలి. చేపట్టిన పనిని చివరి వరకు వదలకుండా చేసే ధైర్యం, స్థయిర్యం ఉన్న సిఎంగా రేవంత్ పేరు తెచ్చు కోవాలి. ఆర్థిక సంస్కరణల్లోనూ ముందుండాలి. ఈ సారి కూడా రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చింది. అందుకు తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పంటల కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారు. ఇవన్నీ సమీక్షించుకుంటేనే ప్రజలకు మేలు చేసిన వారు అవుతారు. విత్తనాల కోసం పోరాడుతున్న వారికి స్వాంతన కలిగేలా తక్షణ చర్యలకు దిగాలి.

**దేశభక్తి గీతాన్ని ఆలపిస్తూ గుండెపోటుతో**

# రిటైర్డ్ ఆర్మీసోల్జర్ మృతి

## మధ్యప్రదేశ్‌లో దురదృష్టకర సంఘటన

ఇండోర్,మే31 (ప్రజా మంటలు):

మధ్యప్రదేశ్‌లో తాజాగా ఓ దురదృష్టకర సంఘటన చోటు చేయుకుంది. రాష్ట్రంలోని ఇండోర్‌లో జరిగిన ఒక ప్రదర్శనలో భారత ఆర్మీకి చెందిన రిటైర్డ్ సైనికుడు గుండెపోటుతో మరణించాడు. మరణించిన సైనికుడిని బల్బిందర్ చావ్డా గా గుర్తించారు. ఇండోర్ నగరంలో దేశభక్తి గీతం పాడుతున్న సమయంలో బల్బిందర్ చావ్డాకు ఒక్కసారిగా గుండెపోటు వచనదని సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 55 సెకన్ల నిడివి గల ఈ వీడియో క్లిప్ లో పిల్లలు, పెద్దలందరు చావ్డాతో కలిసి దేశభక్తి గీతాన్ని పాడుతున్నట్లు కనిపిస్తుంది. వీడియో గమనిస్తే., చావ్డా గుండెపోటు రావడంతో అక్కడిక్కడే వేదికపై కుప్పకూలినట్లు కనిపించింది. ఆ సమయంలో పిల్లలు చప్పట్లు కొడుతూ దేశభక్తి గీతాన్ని ఆలపిస్తూ ఉన్నారు. గుండె పోటు కారణంగా చావ్డా వేదికపై పడుకున్నట్లు వీడియోలో కనపడుతుంది. ఇక విషయాన్ని గ్రహించిన కొందరు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా చావ్డా మృతి చెందినట్లు సమాచారం అందింది.

# ప్రజలకు 200 కోట్ల కుచ్చుటోపీ

**కో ఆపరేటివ్ బ్యాక్ జిఎం నిమ్మగడ్డ వాణిబాల అరెస్ట్**

**భర్త నేతాజీ, కుమారుడు శ్రీహర్ష కూడా అరెస్ట్**

హైదరాబాద్,మే31(ప్రజా మంటలు):

డిపాజిట్ల పేరుతో రూ.200 కోట్లకు కుచ్చుటోపి పెట్టిన కేసులో ప్రధాన నిందితురాలు తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ నిమ్మగడ్డ వాణిబాలను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆమె భర్త మెకా నేతాజీ తో పాటు అతని కుమారుడు శ్రీ హర్షను కూడా అరెస్ట్ చేశారు. తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకులో పనిచేసే 140 మంది ఉద్యోగులను వాణి బాల మోసం చేశారు. ఆమె మాటలు నమ్మిన ఉద్యోగులు 26 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టారు. ఈ డబ్బు మొత్తాన్ని వాణి బాలకు చెందిన ప్రియాంక ఎంటర్ ప్రైజెస్‌లో డిపాజిట్ చేశారు. శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్ పేరుతో అబిడ్స్‌లోని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న నిమ్మగడ్డ వాణి బాల సుమారు 532 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేశారు. ఆమె భర్త మేక నేతాజీ, కొడుకు మేక శ్రీహర్షలు డిపాజిట్ల సేకరణ చేశారు. నెలకు 24 శాతం రిటర్న్ ఇస్తామని నమ్మబలికారు. మొత్తం 532 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేసి ఆ డబ్బులు తీసుకొని పరార్ అయ్యారు. దీంతో వాణి బాలను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విషయం బయట పడడంతో బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ సీసీస్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో వాణి బాల చిట్ ఫండ్ కంపెనీ, శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. సుమారు రూ. 200 కోట్ల స్కామ్ జరిగినట్లు గుర్తించారు. ప్రధాన నిందితురాలు నిమ్మగడ్డ వాణిబాలతో పాటు ఆమె భర్త, కొడుకును అరెస్ట్ చేశారు.

# విమర్శకులకు అభివృద్దే మా సమాధానం

**దశాబ్ది ఉత్సవాల్లో అభివృద్ధిని గమనించండి**

**విమర్శలు చేసే వాళ్లు ఇతర రాష్ట్రాల్లో అభివృద్ధి చూపాలి**

**కాంగ్రెస్, బిజెపిల తీరుపై మండిపడ్డ వేముల**

నిజామాబాద్,మే31 (ప్రజా మంటలు):

నిజామాబాద్ లాంటి పట్టణంలో ఐటి సెంటర్‌తో పాటు, పరిశ్రమలకు అవకాశం ఏర్పడింది కేవలం బిఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లనే అని మాజీ మంత్రి వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. భారీ పరిశ్రమలొచ్చి లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చాయని, పల్లె, పట్టణాలు ప్రగతి సాధించాయని అన్నారు. దశాబ్ది ఉత్సవాల వేళ తెలంగాణ ఏం సాధించిందో అని అడిగే వారికి అభివృద్ధితో సమాధానం చెబుతామని అన్నారు. తమను విమర్శిస్తున్న వారు తాముచేసిన అభివృద్ధిని కూడా ప్రస్తావించాలని అన్నారు. దండుగన్న వ్యవసాయం పండుగైందని నిరూపించామని వివరించారు. తెలంగాణలో ధాన్యం దిగుబడులు పెరగడానికి కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమని అన్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడాలని కోరుకుంటున్నామని, బిఆర్‌ఎస్ నిర్ణయాత్మక పాత్ర పోషించాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. ఎంపి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ సత్తా చాటబోతున్నది చెప్పారు.కేసీఆర్ ప్రధానమంత్రి కావలన్నదే ప్రజల ఆకాంక్ష అని వెల్లడించారు. అప్పుడే ఆయన సారథ్యంలోనే అన్ని రాష్ట్రాల్లో తెలంగాణలో అనుసరించిన పథకాలు అమలవుతాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. తాము చేసిన అభివృద్ధిని కొనసాగిస్తే సమస్యలు రావని అనినారు. బిజెపి పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పథకం చూపాలన్నారు. సంపద పెంచడం, పేదలకు పంచడమే కేసీఆర్‌కు మాత్రమే చేసి చూపారని అన్నారు. దేశాన్ని అధోగతి పాలు చేస్తున్న మోదీకి అభివృద్ధి గురించి ఏం తెలుసని అన్నారు. సొమ్ము రాష్ట్రాలది, సోకు మోదీది అన్నట్లుగా మారిందన్నారు. పిల్లలు తాగే పాలపైనా జీఎస్టీ విధించిన ఘనుడు మోదీ. ఈ ఎన్నికల్లోనూ చెడుపై మళ్లీ మంచే గెలవాలి. బిఆర్‌ఎస్ గెలుపే తెలంగాణకు నిజమైన పండుగ కావాలన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రైతులకు 24 గంటల ఉచిత కరెంటొచ్చిందని, ఇంటింటికీ నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీళ్లొచ్చాయని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగుపడ్డాయని, ఆ చెరువుల్లో చేపలు పెరుగుతూ మత్స్యకారుల జీవితాల్లో వెలుగొచ్చిందని, గొర్రెల సంపదతో గొల్లకురుమల వాకిళ్లు కళకళలాడాయని వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లు జరిగాయని తెలిపారు. ఎంపీ అర్వింద్ జిల్లాకు పట్టిన చీడ అని, కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోకుండా విమర్శలు చేయడం పనిగా పెట్టుకున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు తాము సిద్ధమని అన్నారు. కెసిఆర్ మాత్రమే రాష్ట్రానికి, దేశానికి దిశా నిర్దేశం చేయగల నాయకుడని అన్నారు.

## మృతుడి కుటుంబానికి చేయూతనందించిన పీఎంకే పౌండేషన్



జమ్మికుంట మే 31 (ప్రజామంటలు): జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రాజ మొగిళి గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు ఈ మేరకు మృతుడి కుటుంబానికి శుక్రవారం రోజున పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకుల ద్వారా 6000 రూపాయల ఆర్థిక సాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపేద కుటుంబాలు ఎవరైతే ఉంటారో వారికి చేయూతనిచ్చేందుకు తన వంతు సహాయం చేస్తానని పేర్కొన్నారు అదేవిధంగా గ్రామంలో గతంలో మాదిరిగానే గ్రామ అభివృద్ధికి దోహదపడుతానని పిఎంకె ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు దీంతోపాటుగా గ్రామస్తుల సహకారం ప్రజల అండదండలతో మరిన్ని సేవలు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్, గండి రంజిత్ కుమార్ గౌడ్, గిరవేన రాజయ్య యాదవ్, గిరవేన బిక్షపతి యాదవ్, కొల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

**వంగరలో పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ పాల్గొన్న వైద్య సిబ్బంది, పోలీసులు, గ్రామస్తులు**



భీమదేవరపల్లి మే 31 (ప్రజామంటలు): మండలంలోని వంగర గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ధూమపానం తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పొగాకు ఉత్పత్తుల వల్ల మనుషుల ఆరోగ్యం క్షీణించడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వంగర ప్రభుత్వ వైద్య సిబ్బంది డాక్టర్ రుబీనా, రెహమాన్, కెఎల్ఎన్ స్వామి, పోలీసులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతం

**విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి**

**అదనపు ఎస్పీ వినోద్ కుమార్**



జగిత్యాల మే 31 (ప్రజామంటలు): విధి నిర్వహణలో అందరి మన్ననలు అందుకొని పదవీ విరమణ పొందిన ఏ.ఎస్.ఐ సత్యనారాయణ ని శాలువా, పులమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసిన అదనపు ఎస్పీ వినోద్ కుమార్. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు ఎస్పీ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.... ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. సుమారు 35 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఏ.ఎస్.ఐ సత్యనారాయణ సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ జానీమియ, ఆర్ఎస్ఐ లు కృష్ణ పాల్గొన్నారు.

### పట్టణంలో నాలాల పూడికతీత పనులను వేగవంతం చేయాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**



జగిత్యాల మే 31 (ప్రజామంటలు): జగిత్యాల పట్టణంలో నాళాలు అంతర్గత డ్రైనేజీల్లో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులను వరద నీరు సాఫీగా వెళ్లేలా నాళాలు క్లియర్ గా ఉంచాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలకు వరద ముంపు లేకుండా నాలాల పూడిక తీత పనులలో వేగవంతంగా పూర్తి చేయాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్ పర్సన్ సమస్యలను తెలుసుకొని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నాలాల పునరుద్ధరణ వివిధ దశల్లో ఉన్నాయని వర్షాకాలంలో వరద నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నాలాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వరద ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 6వార్డు కౌన్సిలర్ కొలగాని ప్రేమలత సత్యం, నాయకులు ఉన్నారు.

### అంజన్న భక్తులకు అరటి పండ్లు వితరణ చేసిన వైశ్య సంఘ నాయకుడు



జగిత్యాల మే 31 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా అంతరాలయంలోని స్వామి వారి అలంకరణకు 2001 అరటి పనులను రామన్నపేట కు చెందిన జిల్లా వైశ్య సంఘ నాయకుడు పోచమల్ల ప్రవీణ్ కుమార్ అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం అరటి పండ్లను ఆలయానికి వచ్చిన హనుమాన్ దీక్షాపరులకు, భక్తులకు ఆయన అందజేశారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫారాలు సకాలంలో అందేలా చర్యలు

**జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్ రావు..**

జగిత్యాల మే 31 (ప్రజామంటలు): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు అందించే యూనిఫారం లు సకాలంలో అందేలా చూడటం జరుగుతుందని, అందుకోసం ఆయా మండలాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళ సంఘాల ద్వారా కుట్టించడం జరుగుతుందని ఇలాంటి అవకాశాల ద్వారా మహిళలకు మంచి ఆర్థిక ఉపాది లభించడం జరుగుతుందని అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్ గల్, పొలాస, పొరండ్ల గ్రామాల్లో మహిళ సంఘాల సభ్యుల ద్వారా తయారు చేస్తున్న దుస్తులను ఆయన పరిశీలించారు. మహిళలకు ఇది మంచి అవకాశం అని ఇంకా మహిళలు ఎక్కువ సంఖ్యలో కుట్టుటకు ముందుకు రావాలని, పర్యవేక్షణ కు మండల ఎపియం లు, సి.సి.లు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా డిపియం లు విజయభారతి, మల్లేశం, ఎపియం వి. గంగాధర్, సి.సి.లు పి. గంగారాం, బి. రవిందర్, వి.ఓ.ఎ. లు, వి.ఓ. అధ్యక్షురాళ్ళు, కుట్టు పని చేస్తున్న సభ్యురాళ్ళు తదితరులు ఉన్నారు.



జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం లో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మామిడి తోటలో అంటుకున్న మంటలు. సమాచారం తెలుసుకొని సకాలంలో వచ్చి మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది.

## బీడీ టేకె దారులకు గుడ్ న్యూస్



నిజామాబాద్ మే 31 (ప్రజామంటలు): ప్రస్తుతం పెరిగిన జీవన వ్యయ పరిస్థితులకు అనుగుణంగా బీడీ టేకేదారులకు 4-50 రూ.ల కమిషన్ పెంచుతూ బీడీ కంపెనీల యాజమాన్యాల అధ్యక్షుడు జితేంద్ర ఉపాధ్యాయ ఆధ్వర్యంలోని కమిటీ నిర్ణయం మేరకు నిజాంబాద్ జిల్లా కేంద్రంలో బీడీ టేకేదారుల సంక్షేమ సంఘంతో జరిగిన చర్చలు ఫలించాయి. ప్రస్తుతం టేకేదారులకు రూపాయలు 18 -10 కమిషన్ ఇస్తుండగా ఇకనుంచి కమిషన్ 22.60 అందనుంది. ఈ సందర్భంగా టేకేదారుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో టేకేదారుల రాష్ట్ర అధ్యక్షుడు డి. నారాయణ ప్రధాన కార్యదర్శి టి. వెంకన్న, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు క్యాస మల్లా రెడ్డి, బొమ్మకంటి గంగాధర్, చిలుకమ్రి, శ్రీనివాస్, సట్ట రవి, కమటం మల్లయ్య, మిట్టపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మహబుబాబాద్ జిల్లా గంగారం మండలం చింతగూడెం లో తన తండ్రి చేయించిన హెయిర్ కటింగ్ నచ్చలేదని పురుగుల మందు తాగిన బాలుడు హర్ష వర్దన్. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి.**



## గాంధీ ఆసుపత్రిలో పలువురు సిబ్బంది పదవీ విరమణ



సికింద్రాబాద్ మే 31 (ప్రజామంటలు): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శుక్రవారం పలువురు ఉద్యోగ సిబ్బంది పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పదవి విరమణ చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ బి. ప్రశాంతి, నర్సింగ్ ట్యూటర్ యమున, జూనియర్ అసిస్టెంట్ ఎంఏ. హఫీజ్, నర్సింగ్ ఆర్డర్లీ శోభారాణి లను సూపరింటెండెంట్ డా. ఎం రాజారావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ ఫ్లోరెన్స్ మెర్లిన్, ఏవో సుభాన్, టీఎన్జీవో ప్రెసిడెంట్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీలో యాంటీ టొబాకో డే అవెర్నెస్ ర్యాలీ



సికింద్రాబాద్ మే 31 (ప్రజామంటలు): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వైద్యులు పొగాకు వాడకం వలన కలుగు అనార్థాలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు మాట్లాడుతూ.. పొగాకు వలన అనేక అనారోగ్య సమస్యలు కలుగుతున్నాయని, ప్రతి ఒక్కరు పొగాకు కు దూరంగా ఉండాలని సూచించారు. క్షణిక సంతృప్తి కోసం విలువైన జీవితాన్ని ఫణంగా పెట్టవద్దన్నారు. ర్యాలీలో ఆసుపత్రి పల్మనాలజీ హెచ్ఓడీ డా. కృష్ణమూర్తి, ఆర్ఎంఓ జయకృష్ణ, ఫ్యామిలీ వెల్ఫేర్ లెక్చరర్ డి. వెంకట రామ నరసయ్య, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న క్షేత్రంలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**జగిత్యాల డిఎస్పీ దురిశెట్టి రఘు చందర్ కు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు**



## 2013-14 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గొల్లపల్లి మే 31 (ప్రజామంటలు): గొల్లపెల్లి మండలం అగ్గిమల్ల పాఠశాలలో పదవ తరగతి చదివిన 2013-14 బ్యాచ్ కు చెందిన విద్యార్థినీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు దాదాపు 10 సంవత్సరాల తర్వాత అందరూ ఒకే చోట అగ్గిమల్ల హైస్కూల్ లో కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు భౌతిక శాస్త్రం ఆత్మచరణ్ ,గణిత శాస్త్రం అశోక్ రావు, తెలుగు లక్ష్మణ్, సామాన్య శాస్త్రం శంకర్ వారు మాట్లాడుతూ 10 సంవత్సరాల తరువాత తమను పిలిచి ఇంతటి తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం, ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాబోధన అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 2013-14 బ్యాచ్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతికి ఏర్పాట్లు పూర్తి



ఇల్లందకుంట మే 31 (ప్రజామంటలు): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శ్రీరామ పుష్కరిణి కోనేరు వద్ద హనుమాన్ స్వాములు మరియు భక్తులు స్నానములు చేయుట గాను ఏర్పాటు చేసిన నీటి పంపు లను పరిశీలించిన ఆలయ కార్య నిర్వహణ అధికారి. హనుమాన్ జయంతి కి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ సిబ్బంది.

## ముగిసిన ఇంటర్ సప్లమెంటరీ ప్రధాన పరీక్షలు

**మార్చిలో హాజరుకాని జూన్ 4 నుండి విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు**

జగిత్యాల మే 31 (ప్రజామంటలు): జిల్లాలో ఇంటర్ సప్లమెంటరీ ప్రధాన పరీక్షలు ముగిసినాయి ఈరోజు ఉదయం పూట జరిగిన పరీక్షలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 2005 మంది విద్యార్థులకు గాను 1907 మంది విద్యార్థులు హాజరైనారు. 98 మంది విద్యార్థులు గై ర్ హాజరైనారు.మధ్యాహ్నం పూట జరిగిన పరీక్షలు విద్యార్థులు 939 మందికి గాను 877 మంది విద్యార్థులు హాజరైనారు 42 మంది విద్యార్థులు గైర్ హాజరైనారు. మార్చిలో హాజరు కాని విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలు 04-06-2024 ఉదయము 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గత మార్చి పరీక్షలలో హాజరు కాని విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తారు. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలు 08-06-2024 ఉదయము 10 గంటల నుంచి 12 గంటల మధ్యన నిర్వహిస్తారు.పర్యావరణ పరీక్ష 11-06-2024, నైతిక మానవ విలువలు పరీక్ష 12-06-2024 ఉదయము 10 గంటల నుండి ఒంటి గంట మధ్య నిర్వహిస్తారు. పైన వివరించిన ఇంగ్లీష్ ప్రాక్టికల్ మరియు పర్యావరణ విద్య, ఎథిక్స్ అండ్ ఉమెన్ వాల్యూస్ పరీక్షలు గత మార్చిలో లేదా అంతకు ముందటి పరీక్షలలో హాజరు కాని వారు, కాని వారు హాజరు కావలసి ఉంటుందని పరీక్షలు కన్వీనర్ బి. నారాయణ తెలియజేశారు.

## జగిత్యాల బైపాస్ రోడ్ లో భానుడి ప్రతాపానికి 20 ద్విచక్ర వాహనాలు దగ్ధం



జగిత్యాల మే 31 (ప్రజామంటలు) జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ లో శుక్రవారం ద్విచక్ర వాహన మెకానిక్ అయినా తిట్ల అన్వేష్ సంబంధించిన ఇంటి ఆవరణలో ఎండ వేడిని తట్టుకోలేక దాదాపు గా 20 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరియు ఇంటిలోని సామాగ్రి కూడా దగ్ధమవగా సుమారుగా 10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేస్తున్నారు. నిరుపేద అయిన యువకుడు స్వయం ఉపాధి పొందుతూ ద్విచక్ర వాహనం మెకానిక్ గా జీవితం గడుపుతున్నాడు. అనుకోని సంఘటన వలన అతని కుటుంబం ఆర్థికంగా పూర్తిగా చితికి పోయే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు తిట్ల అన్వేష్ కోరారు.

## మహిళల భద్రత మరియు రక్షణ కు షీ టీమ్స్ తో మరింత భరోసా

**మహిళలు, విద్యార్థినులు ఆపద సమయంలో**

**జిల్లా షీ టీమ్ నెంబర్ 8712670783 ద్వారా పిర్యాదు చేయవచ్చు**




జగిత్యాల మే 31 (ప్రజామంటలు): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రం లో గల స్వామీ వివేకానంద మినీ స్టేడియంలో షీ ఏ హెచ్ టి యు టీమ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలికల, విద్యార్థిని విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ తరఫున షీ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు షీ టీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని లేదా 8712670783 వాట్సప్ ద్వారా కూడా పిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా పరిధిలో పాఠశాలలు/కళాశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు ఇద్దరి చొప్పున విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్,ఆకతాయిల వేధింపులను అరికట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు బాలికలు విద్యార్థిని విద్యార్థులు వెంటనే జిల్లా షీ టీం ఫోన్ నెంబర్ 8712670783 కి కాల్ చేసిన కాని, వాట్సాప్ ద్వారా సందేశం పంపించి వెంటనే షీ టీమ్స్ సహాయం పొదలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ వలీ బెగ్, ఉమెన్ కానిస్టేబుల్ లు మరియు క్రీడాకారిణి లు పాల్గొన్నారు.

## విత్తనాల కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

**కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**



జగిత్యాల మే 31 (ప్రజామంటలు): ఈనెల మూడో తేదీ నుండి బడిబాట ప్రారంభం నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష గ్రామాల్లోని పలు పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వెళ్తుండగా మార్గమధ్యలో జిల్లా కేంద్రంలో ఆకస్మికంగా ఓ ఫర్టిలైజర్ షాపును తనఖీ చేశారు. అక్కడే ఉన్న రైతును విత్తనాల సరఫరా గూర్చి అడిగి తెలుసుకున్నారు. కాగా రైతు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాకు కావలసిన జీలుగ తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఖమ్మం తర్వాత జగిత్యాలకు ఎక్కువ మొత్తంలో విత్తనాల సరఫరా అయిందని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. గ్రామపంచాయతీలో గ్రామసభల ద్వారా ఎప్పటికప్పుడు విత్తనాల విషయంపై రైతుల సమస్యలు తెలుసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసు, రెవెన్యూ తదితర అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా షాపుల యజమానులు కేవలం విత్తనాలు అమ్మడమే కాకుండా రైతులకు మందులు ఎప్పుడు వేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించే విధంగా బ్యానర్లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఫర్టిలైజర్ షాపుల యజమానులపై ఉందని అన్నారు.

## పత్తాలేని స్పెషల్ ఆఫీసర్లు!

**ఖాళీగా గ్రామ పంచాయతీల ఖాతాలు**

**పంచాయతీ నిర్వహణకు ఇబ్బందులు**

**అప్పుల ఊబిలో పంచాయతీ కార్యదర్శులు**

**కార్యదర్శులపై పని భారం**

ఎల్కతుర్తి మే 31 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలంలోని ఈ ఏడాది జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగిసింది. ఫిబ్రవరిలో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. వివిధ శాఖలకు చెందిన వారిని స్పెషల్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించింది. వారిలో కొందరికి గ్రామ పాలనపై ఎలాంటి అవగాహన లేక పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారికి గ్రామ పాలన, నిధుల విషయంలో స్పష్టత లేకపోవడంతో గ్రామ పాలన పడకేసింది. దీంతో గ్రామ పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం కరెంట్ బిల్లులు,బోరు మరమ్మతులు, ట్రాక్టర్లకు డీజిల్ కొనలేని పరిస్థితులు షాద్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొన్నాయి. సర్పంచుల పదవీకాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల చేతుల్లోకి గ్రామ పాలన వెళ్లింది. వారికి నిధులు, విధులపై స్పష్టత లేక రావడం, పోవడం తప్ప ప్రత్యేకాధికారులు చేసిందేమీ లేక కార్యదర్శులకే పని భారమౌతోంది. ఆర్థిక పరమైన సమస్య వచ్చిన పుడు స్పెషల్ ఆఫీసర్లు చేతులెత్తేయడంతో అప్పులు చేసి మరీ కనీస అవసరాలు తీర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు నానాతంటాలు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామ పాలనను కొనసాగిస్తున్నారు. గ్రామ సిబ్బందికి నెలల కొద్దీ జీతాలు రాకపోవడంతో సొంతంగా డబ్బులు ఇచ్చి ప్రభుత్వం నుంచి వచ్చినప్పుడు తీసుకునే పరిస్థితి నెలకొన్నదని పంచాయతీ




కార్యదర్శులు ఆవేదనవ్యక్తం చేస్తు న్నారు. ఆర్థిక భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోందని, ప్రభుత్వం సమయానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

**సమయానికి నిధులు రాక..**

15 వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ ఇచ్చే నిధులు, పన్నుల వసూళ్లు పంచాయతీలకు ముఖ్యమైన ఆర్థిక వనరులు, చాలా కాలంగా ఎస్ఎఫ్సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు రావడం లేదు. కేంద్ర కేంద్ర ప్రభుత్వం నేరుగా జనాభాకు అనుగుణంగా పంచాయతీకి ఇచ్చే నిధులు ప్రత్యేకపాలన ప్రారంభమైనప్పటి నుంచి రావడం లేదు. పన్ను వసూళ్లు అవుతున్నా ఖర్చులు పెరగడంతో మెయింటెనెన్స్ తప్ప మిగులు ఏమీ ఉండడం లేదు. ఇక మాకేం సంబంధం లేదన్నట్లుగా స్పెషల్ ఆఫీసర్లు కనీసం పంచాయతీల వైపు కన్నెత్తి చూడకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక పని భారం పడుతుంది. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేస్తే ఉత్సాహంగా పని చేసుకుంటామని కార్యదర్శులు అంటున్నారు.




# గాలిపటం

కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నట్ స్క్రయిబ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com



, చింటూ, బన్నీ మంచి స్నేహితులు. ఒకే బడిలో ఆరో తరగతి చదువుతున్నారు. ఇద్దరివీ పక్కపక్క ఇల్లు కావడం తో ఆటలు, చదువు అన్నీ కలిసిగడుపుతారు.

ఆరోజు బన్నీ వాళ్ళమ్మ మైసూర్ పాక్ చేసింది. బడినుండడి రాగానే అమ్మ మైసూర్ పాక్ ఇచ్చింది. అది తిని "అమ్మా!చింటూ కి కూడా పెడతాను. మైసూర్ పాక్ ఇవ్వు. తిని ఆడుకుంటాము " అన్నాడు.

అమ్మ ఇచ్చిన మైసూర్ పాక్ చింటూ కి ఇచ్చాడు. వాడు అది తీసుకొని తన జేబులోంచి జంతికలు తీసి బన్నీ కి ఇచ్చాడు. వాళ్ళ అమ్మలు చేసిన జంతికలు, మైసూర్ పాక్ తింటూ మెచ్చుకున్నారు. కరకర, తీపి పాక్ లాగించారు.

ఆరోజు పెద్దగా హెూంవర్క్ లేకపోవడం తో కాసేపు ఆడుకుందాం అని బన్ని, చిన్ని రెండిళ్ల అవతల పిల్లలు డాబామీద గాలిపటం ఎగరేయడం చూసి

మనం కూడా గాలిపటం ఎగరేద్దాం అనుకున్నారు. నా దగ్గర లేదు గాలిపటం అన్నాడు బన్నీ. నా దగ్గర ఉంది ఆడే ఎగరేద్దాం, అన్నాడు చింటూ. ఇద్దరూ గాలిపటం తీసుకుని డాబామీదకు వెళ్లారు. అక్కడ ఓ మూల చెక్కలు, ఇనుప ఊచలు, నాప రాళ్లు పెట్టి ఉన్నాయ్. మనం అటు వెళ్లకుండా ఇక్కడ ఎగరేసుకుందాం, అన్నాడు చింటూ.

ఇద్దరు గాలిపటం ఎగరేయడం మొదలు పెట్టారు. అది అలా అలా పైకి పైకి ఎగురుతుంటే సంబరపడ్డారు. ఇంతలో గాలిపటం ఉన్నట్టుండి కిందకి పడిపోసాగింది. చింటూ దారం అటు ఇటూ తిప్పినా ఆగకుండా వచ్చి డాబాపిట్టగోడ పక్కన ఉన్న కరెంటు వైర్ మీద పడింది. అది చూసి బన్నీ గబుక్కున అటువెళ్లి అక్కడ ఉన్న ఇనుప ఊచతీసుకొని దాంతో గాలిపటం తీయాలి అనుకున్నాడు. చింటూ వెంటనే దారం వదిలేసి పరుగునవెళ్ళి ఒక చెక్క తీసుకుని ఆ ఊచమీద కొట్టి బన్నీ ని వెనక్కు లాగాడు. బన్నీ ఆశ్చర్య పోయి కోపంగా ఏంటిరా అలా కొట్టి పడేసావు అని అరిచాడు.

నీకు మతి లేదేమిటిరా. ఆ ఇనుప ఊచకి కరెంటు వైరు తగిలితే షాక్ కొట్టి పడిపోతాం. నువ్వు గాలిపటం మీద ధ్యాసలో అది గమనించకుండా ఇనుప ఊచ తీసావు తెలుసా, అన్నాడు చింటూ..అవున్రా. నేను అది ఆలోచించలేదు. థాంక్స్ రా, అన్నాడు బన్నీ.

అందుకే మా అమ్మ గాలిపటం డాబా మీదనుండి ఎగరేయవద్దు. పార్కుకి వెళ్లి ఎగరేయండి, అని చెబుతుంది. అప్పుడు కరెంటు వైర్ ల్రప్రమాదం తప్పించు కోవచ్చు. అన్నాడు చింటూ.

ఎటోచ్చి చెట్ల మీద చిక్కుకుంటుంది.కదా. అన్నాడు బన్నీ.

అయినా మన ప్రాణాలకు ప్రమాదం ఉండదు. ఇంకో గాలిపటం కొనుక్కోవచ్చు., అన్నాడు చింటూ.


నిజమేరా

. మా పిన్నికొడుకు వైజాగులో డాబా మీద టవల్ ఆరేసి గాలికి అది ఎగిరి కరెంటు వైర్ మీద పడితే తియ్యబోయి షాక్ కొట్టి చేతి వేళ్ళు అతుక్కు పోయాయట మా అమ్మ చెప్పింది, అన్నాడు బన్నీ.

అందుకే మా అమ్మ డాబా మీద ఆడుకోవద్దు అని చెబుతుంది అన్నాడు చింటూ. పోనీలే. ఇకనుంచి జాగ్రత్త గా ఉందాం. అని నవ్వుకుంటూ మెట్లు దిగి ఒకరి భుజాలమీద ఒకరు చేతులు వేసుకుని పార్క్ లో ఆడు కోవడానికి వెళ్లారు.

**- ముంజులూరి కృష్ణ కుమారి**

# గాంధీజీ ఆత్మకథ



వేసవి సెలవుల్లో భాగంగా యువత, విద్యార్థులు మరియు పెద్దవాళ్ళు కూడా ప్రపంచ వ్యాప్తంగా బైబిలు తర్వాత వివిధ భాషలలో అనువాదం పొందిన మరియు ఈ శతాబ్దంలో వివిధ రంగాల్లో ప్రపంచ ప్రముఖులైనా ఆల్బర్ట్ ఐన్ స్టీన్, నెల్సన్ మండేలా,బరాక్ ఒబామా,దలైలామా, మార్టిన్ లూథర్ కింగ్, చార్లీ చాప్లిన్, బెర్నార్డ్ షా,స్టీవ్ జాబ్స్ వంటి మహానుభావుల నుంచి సాధారణ ప్రజానీకం వరకు తన జీవన విధానాలతో ఆనాటి నుంచి నేటితరం వరకు ప్రభావితం చేస్తున్న మన గాంధీజీ ఆత్మ కథ "మై లైఫ్ ఎక్సపర్మెంట్స్ విత్ ట్రూత్"(సత్యంతో నా ప్రయోగాలు) పుస్తకాన్ని చదవటం,మిత్రులకు జ్ఞాపిక గా ఇవ్వడం చేయాలి.సత్యం,అహింస లతో ఆయన నడిచిన,నడిపిన మానవతావాదం, పర్యావరణ పరిరక్షణ ,శాంతి సహనపు సందేశం,విలువలతో కూడిన శాస్త్రీయ విద్యా విధానం వంటివి మనకు, భవిష్యత్తుకు దిక్సూచిలా వుంటాయి.గాంధీజిని మన దేశంలో కొంత మంది కేవలం మన స్వాతంత్ర్య సంగ్రామపు కోణంలో మాత్రమే చూడటం సంకుచితం .ఆయన స్ఫూర్తితో ఎంతోమంది నోబెల్ బహుమతి లు గెలిచారు.ప్రపంచస్థాయి ఉద్యమాలు నడిపారు.

కె సి ఆర్ నాయకత్వంలోని తెలంగాణ ఉద్యమ ప్రస్థానం మరియు రాష్ట్ర సాకారం కూడా గాంధీజీ మార్గంలో పొందిన ఫలాలే.గాంధీజి ఆత్మకథ పుస్తకం ప్రతి ఇంట్లో వుండాల్సిన,మనమంతా చదవాల్సిన పుస్తకం.

"సత్యం వెయ్యి సూర్యుల వెలుగు కంటే ప్రకాశవంతమైనది."సర్వజన హితం నా మతం" వంటి ఆయన మాటలు శాస్త్రీయ సత్యాలు.

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**నాగర్ కర్నూల్**
**9394749536**

# అఖిలపక్షంతో చర్చలు ఎల్లవేళలా అవసరమే!

రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ తెలంగాణ ప్రభుత్వం గత ఆరు నెలల పనితీరును పరిశీలిస్తే.. ప్రజా స్వామ్యయుతంగా ముందుకు సాగుతున్నదనే చెప్పాలి. కలిసి చర్చించిడం, ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. తాజాగా తెలంగాణ గీతాన్ని ఆమోదించే క్రమంలోనూ అఖిల పక్షాన్ని పిలిచి, వారితో చర్చించి, వారు ఆమోదించిన తరవాత గీతాన్ని ఆమోదించారు. తెలంగాన అవతరణ దినోత్సవాన జూన్ 2న దీని ఆవిష్కరణ జరుగనుంది.ఇలాంటి నిర్ణయాలు మంచి సంప్రాదాయన్ని తెలియ చేస్తాయి. తెలంగాణ ఏర్పడ్డ తొమ్మిదన్నరేళ్ల కెసిఆర్ పాలనలో అఖిలపక్షాలు లేవు. సంప్రదింపులు లేవు. చర్చలు లేవు. ఏదైనా ఏకపక్ష నిర్ణయాలు... ఫామ్‌హౌజ్ చర్చలు అన్నచందంగా మారింది. ప్రజాస్వా మ్యాన్ని పాతరేసిన కల్వకుంట్ల వారు ఇప్పుడు ప్రజల గురించి మాట్లాడడం ప్రజలు కూడా జీర్ణించుకోలేక పోతున్నారు. అయితే ఎన్నికలు జరగడం.. ఫలితాల్లో ఓ పార్టీ అధికారంలోకి రావడం తో మిగతా ఎన్నికైన వారిని పాలనకు దూరంగా పెట్టడం సరికాదు. వారు కూడా ప్రజలు ఎన్నుకుంటేనే ఎమ్మెల్యేలు, ఎంపిలుగా ఎన్నికయ్యారు. కాబట్టి ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని చర్చించాలి. ప్రజలకు తెలియచేయాలి. ఏకపక్ష నిర్ణయాలు సరికాదని గుర్తించాలి. సిఎం రేవంత్ రెడ్డి కూడా మున్ముందు మరింత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్ణయాలు తీసుకుని ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టాలి. దశాబ్ది ఉత్సవాల వేళ అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించడం, అఖిలపక్షంలో చర్చించడం ఆహ్వానించదగ్గ నిర్ణయం. మాజీ సిఎం కెసిఆర్‌ను కూడా ఉత్సవాలకు ఆహ్వానించడం రేవంత్ నాయకత్వంతో పాటు, ఆయన హుందాతనానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇక పాలనా పరంగా ఉన్న అనేకానేక సమస్యలను కూడా ప్రజా ప్రతినిధుల, క్షేత్రస్థాయి నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు జరిగేలా చేయాలి. ఏయే అంశాలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారో వాటిని ముందుకు చర్చించాలి. తెలంగాణ ఏర్పడ్డ తరవాత గత దశాబ్ద కాలం పరిశీలిస్తే సిఎం కెసిఆర్ కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజలకు సంబంధం లేకుండా పాలన చేశారు. దీంతో అప్పులు చేసి తెలంగాణను అథఃపాతాళానికి నెట్టారు. దీనిపై మాట్లాడితే.. తెలంగాణ పరువు తీస్తున్నారని కెటిఆర్, హరీష్ రావులు అంటున్నారు. అప్పులు చేసినట్లు చెబితే తప్పెలా అవుతుందో చెప్పాలి. ప్రధానంగా సాగునీటి రంగంలోనూ, విద్యుత్ రంగంలోనూ కీలక నిర్ణయాలు తీసుకు న్నట్లు చెప్పి, ఆయా రంగాల్లో పెద్ద ఎత్తున అప్పులను చేశారు. ఆర్థిక పరమైన నిర్ణయాల్లో విచ్చలవిడి కారణంగా రాష్ట్రంలో మరిన్ని సమస్యలకు దారితీసింది. ఇప్పుడు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ సమస్యలపై రేవంత్ ప్రత్యేక దృష్టి సారించాల్సి అవసరం ఉంది. ఇక రైతు రుణమాఫీ అన్నది కూడా నిరంతరాయంగా కొనసాగించడం సరికాదు. రైతులకు కావాల్సింది మాఫీలు కాదు.. పంటలు పండగానే కొనుగోలుచేసి వారు రోడ్డెక్కకుండా చేయగలగాలి. విత్తనాలు, ఎరువుల అందుబాటులో ఉంచాలి. ఏ పొలంలో ఏ పంట వేయాలన్నది క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారుల ద్వారా చెప్పించాలి. అదేపనిగా వరి వేయడం కాకుండా డిమాండ్ ఉన్న పంటలను పండించేలా..వాటిని కొనుగోలు చేస్తామన్న భరోసాను రైతులకు కలిగించాలి. మార్కెట్ యార్డులు, రైతు సంఘాలను బలోపేతం చేయాలి. కెసిఆర్ హయాంలో రైతుబంధు సమితి నేతలు ఏనాడూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతుల సమస్యలపై ఆరా తీయలేదు. అలాకాకుండా రైతులు ఏం కోరుకుంటున్నారో చేయగలగాలి. పత్తివిత్తనాల కోసం ఆదిలాబాద్‌లో రైతులు చేస్తున్న ధర్నాలను సీరియస్‌గా తీసుకుని అక్కడి నేతలు నేరుగా వెళ్లి పరిష్కరించే చొరవ చూపాలి. ఉత్సవ విగ్రహం లాంటి నేతలను పక్కన పెట్టాలి. అలాగే ఉచిత విద్యుత్‌పైనా నియంత్రణ ఉండాలి.వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టి విద్యుత్ వినియోగాన్ని అంచనా వేయాలి. అలాగే వ్యవసాయా నికి నిజంగానే ఎంత కరెంట్ అవసరమో అంతే ఉచితంగా ఇవ్వాలి. దుబారాకు కళ్లెం వేయకపోతే దాని ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉంటుంది. ఉచిత బస్సులను కూడా తాహతును బట్టి,పేద,బడుగు మహిళలకే పరిమితం చేయాలి. జూన్ 2న అవతరణ దశాబ్ది దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ కఠిన నిర్ణయాలతో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ముందుకు సాగాలి. వివిధ రంగాల్లో గట్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తెలంగాణ పురోగమనంలో కీలక అడుగులు వేయాలి. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే తెలంగాణ ముఖచిత్రం మార్చేలా నిర్ణయాలకు శ్రీకారం చుట్టాలి. బిఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన అన్ని విధానాలను సమీక్షించుకుని ముందుకు సాగడం అలవర్చుకోవాలి. సిఎం రేవంత్‌పై ప్రజలు విశ్వాసాన్ని ఉంచినందున.. అందుకు తగ్గట్లుగా హామీలను నెరవేర్చే బాధ్యతలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. తెలంగాణ కోటి రతనాల వీణగా భాసిల్లా లంటే అందుకు కావలసిన సంకల్పబలాన్న చాటాలి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి. ఉచిత విద్యుత్ పథకం మంచిదే అయినా సమీక్షించుకుని పక్కాగా అమలు చేయాల్సి ఉంది. ఉచిత విద్యుత్‌కు విఘాతం కలిగించకుండా మీటర్లు పెట్టి విద్యుత్ వాడకాన్ని లెక్కించుకోవడం అన్నది అకౌంటబులిటీని తెలియ చేస్తుంది. ఇదే తరహాలో తెలంగాణలో మీటర్లు పెట్టి ఏ రైతులకు ఎంత పొలం ఉంది.. వారు ఏ పంటలు వేస్తున్నారో లెక్కలు తీయాలి. ఏ పంటకు ఎంత విద్యుత్ అసవరమో అన్నది గుణించాలి. అన్నింటికి మించి పాతబస్తీలో అక్రంగా వాడుతున్న కరెంట్‌పై కన్నేయాలి. ఇలా దౌర్జన్యం చేస్తున్న వారిని పట్టుకుని కేసులు పెట్టాలి. దొంగ కరెంట్ వాడకం అన్నది నేరంగా గుర్తించి, దీనిని అరికట్టగలగాలి. లేకుంటే బిల్లులు కట్టే వారిపైనే అధిక భారం పడుతూ పోతోంది. ఇదే సందర్భంలో ఖజనాకు భారంగాను, ప్రజలకు భారంగానూ మారుతున్న పథకాలను సమీక్షించుకోవడంలో తప్పులేదు. విద్యుత్ వాడకంపై నియంత్రణ లేకుంటే ఉచిత పథకాలు మెడకు చుట్టుకుంటాయి. ఇదే సందర్భంలో దుబారాను అరికట్టకపోతే మరింత భారం తప్పదు. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాలకు వర్తిస్తుంది. దశాబ్ది ఉత్సవాల వేళ రేవంత్ సర్కార్ మంచి నిర్ణయాలతో ప్రజలకు మరింత చేరువ కావడానికి ముందుకు సాగాలని ఆశిద్దాం.

# సర్వాంగ సుందరంగా ట్యాంక్‌బండ్

## దశాబ్ది ఉత్సవాల కోసం మెరుగులు

హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ):



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆ ప్రాంతాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల మొక్కలతో అలంకరిస్తున్నారు. జూన్ 2న ఉదయం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై దశాబ్ది అవతరణ దినోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా ప్రత్యేక అతిథిగా వస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ కళారూపాలతో ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రధాన వేదికపై పలు శాస్త్రీయ, జానపద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర అధికారిక గీతం 'జయజయహే తెలంగాణ'పై పోలీసు సిబ్బంది ప్రదర్శన చేపడతారు. ఉత్సవాలకు పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో భద్రత, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రతువులో రహదారులు, భవనాలు, బల్దియా, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్తు, పర్యాటక, సమాచార, అగ్నిమాపక, పోలీసు తదితర శాఖలు నిమగ్నమయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉంటాయి.

## తెలుగు భాషా సౌందర్యం

### అక్షర పదాలు - వ్యాక్యాలు

తెలుగు 52 అక్షరాలను 'అ నుంచి ఱ' వఱకు ఆయా అక్షరాలతో ప్రారంభమయ్యే చిన్న వాక్యాలతో చిన్న పిల్లల చేష్టలను వర్ణిస్తూ, ఒక సరదా సంఘటనను సృష్టించుకొని, ఒక చిన్న కథగా చెప్పినారు (శ్రీ అంబాళం పార్థసారధిగారు)

(అ)మ్మ చేతి గోరుముద్దలు తినిన పిల్లలు
(ఆ)నందంగా పాఠశాలకు వెళ్లబోతూ,
(ఇ)ళ్లలోంచి బయట పడుతూనే
(ఈ)లల గోలల మోతలతో,
(ఉ)రుకులు పరుగులతో హడావుడిగా వెళ్లి, బడిలో
(ఊ)యల, ఉడతల కథలు హాయిగా వింటారు.
(ఋ)ణ, సంబంధ ఇక్కట్లు తెలియక
(ౠ) అని తమాషాగా దీర్ఘం తీసుకుంటూ,
(ఎ)ఱుపు, నలుపు, పసుపు,తెలుపు రంగులు కల
(ఏ)డు రంగులు కలబోసిన సీతాకోకచిలుకల్లాగా,
(ఐ)దారుగురు ఆడ,మగ స్నేహితులు కలిసి సరదాగా
(ఒ)ప్పుల కుప్ప ఒయ్యారి భామా ఆటాడుకుంటూ,
(ఓ)డల ఒంటెల కథలు ఒకరికొకరు చెప్పుకుంటూ,
(ఔ)రా నువ్వెంత? నేనే బాగా చెప్పానని విఱ్ఱవీగుతూ, ఇలా
(అం)దరూ ఎంతగానో సంతోషిస్తూ, ఆనందంగా
(అః) అః అహహహా అంటూ ముద్దులొలికే నవ్వులతో ఇంటికి వచ్చేస్తారు.

(క)డుపాత్రం ఎఱిగిన తల్లి అయ్యోపాపమంటూ, అతి ప్రేమగా
(ఖ)ర్జూరపు పండ్లు నోటిలో దట్టించి పెట్టగా,
(గ)బ గబా తినేసిన బుజ్జాయిలు, అలా తినిన
(ఘ)నాహారం జీర్ణమయ్యే వఱకు ఆడుకుంటూ, ఆటల పాటలను
(ఙ్ఞ)ప్తికి తెచ్చుకొని, నెమరేసుకుంటూ ఇంటికొచ్చి, తిని, నిద్దరోతారు.

మళ్లీ మరుసటి రోజు యథాప్రకారంగా, అమ్మ పిలుపుతో లేచి,..

(చ)క చకా తయారై, పాఠశాలకు వెళ్లిపోయి, ప్రార్థన తర్వాత
(ఛ)లో అనుకుంటూ తరగతుల్లోకి చేరుకోని,
(జ)తలు జతలుగా పిల్లలంతా కలసికట్టుగా వెళ్లి
(ఝ)మ్మని ఎవరి సీట్లలో వాళ్లు సర్దుకొంటుండగా, మాస్టారొచ్చి
() అక్షరాన్ని వ్రాయమంటే, రాక, బిక్కమొహం వేస్తారు.

(ట)క్కుటమారు విద్యలనారితేరిన, టక్కరి తుంటరి పిల్లలు
(ఠ)పీ, ఠపీమని బల్లలపై శబ్దాలు చేస్తుంటే,
(డ)ప్పుల మోతల్ని మించిన శబ్దాలను విన్న మాస్టారు
(ఢ)క్కాలు బద్దలు కొట్టినట్లుగా ఎవర్రా అది, అని అరుస్తూండగానే,
(ణ)ణణణణణ ణ, ణ, ణ అని ఇంటి గంట మోగిన క్షణంలోనే...

(త)లుపులు తోసేసుకుంటూ,
(థ)పా థపా మనే శబ్దాలు చేసుకుంటూ,
(ద)బ్బు దబ్బున తరగతిలోని పిల్లలందరూ
(ధ)న ధనామంటూ కాళ్ల నడకల శబ్దాల ప్రతిధ్వనులతో
(న)లువైపులా పరికిస్తూ, గుడి లాంటి బడి గడప దాటిన పిల్లలు,

(ప)రుగు పరుగున కొందరు,
(ఫ)స్టు నేనంటే నేనని పోటీపడుతూ ఇంకొందరు,
(బ)యటకు పూర్తిగా వచ్చేసి,
(భ)లే భలే, ఎవరు ఇళ్లకు ముందుగా చెరుతారని పందెంతో కొందరు,
(మ)న స్కూలు, 'చాలా మంచి స్కూలబ్బా' అని, ఇంకొందరు,
(య)థాలాపంగా, ఏ హావభావాలూ లేకుండా కొందరు,
(ర)య్ రయ్ మంటూ పిచ్చి శబ్దాలతో ఇంకొందరు,
(ల)గెత్తుకొని, తోటి పిల్లలను తోసేసుకుంటూ,
(వ)చ్చి పోయే వ్యక్తులను ఓర కంటితో చూస్తూ, దారిపై వచ్చిపోయే
(శ)కటములను తమాషాగా తప్పించుకుంటూంటే,
(ష)రా మామూలే, 'వీళ్లెప్పుడూ మారర్రా' అని కొందరనుకుంటుండగా,
(స)రదాగా అల్లరి చేసుకుంటూ, ఆనందంతో
(హ)ర్షాతిరేకాలు మిన్ను ముట్టగా, గందరగో-
(ళ) కోలాహల కలకలాతో రేపు ఆదివారం, సెలవు అనుకుంటూ
(క్ష)ణాలలో వారి వారి ఇళ్లకంతా, మన కొ-
(ఱ)కరాని కొయ్యలందరూ తల్లుల ఒడిలోకి చేరి తరిస్తారు.

ఇలా, తమాషాగా 'అఆ ఇఈ లతో, కఖ గఘ లతో' అందమైన ఒక సంఘటనను వర్ణించి చెప్పుకొని ఆనందించవచ్చు. ఇది చదివిన ఉత్సాహవంతులు, భాష మీది అభిమానంతో, తెలుగు భాష మీది పట్టుతో, అచ్చులతో హల్లులతో ఇంకా ఎన్నెన్నో అర్థవంతమైన, అందమ్కైన కథలను, సంఘటనలను సృష్టించుకొని, వారి ప్రతిభకు సాన పెట్టవచ్చు. అలాగే, మీ మీ పిల్లలకు ఇలా వ్రాయలని మార్గ దర్శకులు కావచ్చు. అతి సుందరమైన, సుమధురమైన, సౌమ్యమైన, కమ్మదనం కలబోసిన, తేట తేట తెలుగును, మృదుత్వంతో కూడిన తెలుగునే మాట్లాడండి. తెలుగులోనే వ్రాయండి. తెలుగు పుస్తకాలు చదవండి, చదివించండి. తేనె లొలుకు తెలుగు తియ్యందనాన్ని తనివితీరా జుఱ్ఱుకొని, మనస్ఫూర్తిగా ఆస్వాదించండి, ఆస్వాదింపజేయండి.

**.-శ్రీఅంబాళం పార్థసారధిగారు.**
**(ముఖపుస్తకం సాహిత్యం-హేతుబద్ధమైన, వివేకవంతమైన జ్ఞానోదయమైన! నుండి)**